జాతీయ తెలుగు దినపత్రిక
ప్రజాజ్యోతి
ప్రతి అక్షరం ప్రజల కోసం
భద్రాద్రి కొత్తగూడెం
సోమవారం | 20 | ఏప్రిల్ | 2026 ◆ పేజీలు : 6

ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి : జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 19, (ప్రజాజ్యోతి) జిల్లాలోని ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. ఆదివారం వ్యవసాయ శాఖ ఏడీఏలు, ఏవోలు, ఏఈవోలు , మీ సేవ కేంద్రాల మేనేజర్లతో గూగుల్ మీట్ ద్వారా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌పై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఆధార్ ద్వారా దేశంలోని ప్రతి పౌరునికి గుర్తింపు కల్పించినట్లుగానే ప్రతి రైతుకు 14 అంకెల విశిష్ట గుర్తింపు సంఖ్య (ఫార్మర్ ఐడి) కేటాయించే కార్యక్రమాన్ని కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. వ్యవసాయ రంగాన్ని పూర్తిగా డిజిటలైజ్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్టు చేపట్టబడినట్లు తెలిపారు. భూమి కలిగిన ప్రతి రైతుకు సంబంధించిన భూ యాజమాన్య వివరాలు,

మిగతా 2 లో...

భగభగమంటున్న సూరీడు...!

2 లో..

- సూర్య ప్రతాపానికి నల్ల సూరీల్లు విలవిల
- నిప్పుల కొలిమిని తలపిస్తున్న బొగ్గు గనులు
- గనుల్లో 50 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు...!
- పని వేళలు మార్చాలని కార్మిక సంఘాల డిమాండ్
- అత్యవసర హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ
- మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న రోడ్లు

సూరీడు సెగలు కక్కుతూ భగభగమంటున్నాడు. రోజు రోజుకు నియోజకవర్గంలో పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తుతున్నారు. మణుగూరు సింగరేణి ఉపరితల బొగ్గు గనుల్లో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని, పని వేళలు మార్చాలని పలు కార్మిక సంఘాలు గొల్లుమంటున్నాయి. యాజమాన్యానికి అధిక ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై లేదని కార్మిక సంఘాలు మండిపడుతున్నాయి. మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చి చేతులు దులుపుకోవడం రక్షణ చర్యలు ఎలా అవుతాయని ప్రశ్నిస్తున్నారు. వేసవి వేడిమితో బొగ్గు గనులు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. దీంతో కార్మికులు విలవిలలాడుతుంటే దానిని దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టు మొదటి షిఫ్ట్, రెండవ షిఫ్ట్ పనివేళలు మార్పు చేయాలని పలువురు కార్మిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

● మణుగూరు, ప్రజాజ్యోతి

కొత్తగూడెం కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు

- నియామక పదవులపై శ్రేణుల ఆగ్రహం
- సీనియర్ నేతలకు అన్యాయం జరిగిందన్న ఆరోపణలు
- పార్టీని నమ్ముకున్న వారికి మొండి చెయ్యి

కొత్తగూడెం, ఏప్రిల్ 19 (ప్రజాజ్యోతి): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ కమిటీలను తాజాగా ప్రకటించిన నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. సంవత్సరాల తరబడి పార్టీకి అంకితభావంతో పనిచేసిన నేతలకు తగిన ప్రాధాన్యం ఇవ్వకుండా కొత్తగా చేరిన వారికి, పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించని వారికి కీలక పదవులు కేటాయించారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కాంగ్రెస్ పార్టీని ఎన్ని కష్టాలు వచ్చినా విడిచి వెళ్లకుండా నమ్మకంతో కొనసాగించిన సీనియర్ నేతలకు ఈ నియామకాలతో నిరాశే మిగిలిందని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. పార్టీ జెండా కూడా మోయని కొంతమందికి కీలక బాధ్యతలు ఇవ్వడం బాధాకరం అంటూ పలువురు కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సుదీర్ఘకాలంగా పార్టీకి సేవలందిస్తున్న తమకు ఈసారి అయినా సముచిత స్థానం దక్కుతుందన్న ఆశతో ఎదురు చూసిన నేతలకు ఈ నియామకాలు నిరుత్సాహాన్ని

మిగతా 2 లో...

భద్రాద్రిలో వైభవంగా గోదావరి నది హారతి

- భక్తిశ్రద్ధలతో పాల్గొన్న భక్తులు

భద్రాచలం టౌన్, ఏప్రిల్ 19, ప్రజాజ్యోతి భద్రాచలం గోదావరి మాత నదిహారతి పురోహితులు మంత్రోచ్చారణలతో అంగరంగ వైభవంగా జరిగిందని భద్రాద్రి బ్రాహ్మణ పురోహిత సంఘం అధ్యక్షులు రామవజ్జల రవికుమార్ అన్నారు. ఆదివారం నాడు శ్రీ సీతారామచంద్రస్వామి దివ్య క్షేత్రం

మిగతా 2 లో...

- న్యాయపీఠాన్ని అలంకరించిన భద్రాద్రి ప్రతిభలు
- ఏజెన్సీ నేల నుంచి హైకోర్టు వరకు ప్రస్థానం
- కష్టాలు జయించి న్యాయరంగంలో విశిష్ట స్థానాలు
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్న విజయ గాథలు
- భద్రాచలం పేరును దేశవ్యాప్తంగా చాటిన న్యాయమూర్తులు

మారుమూల నుంచి మహోన్నతం వరకు...

5 లో..

ఏజెన్సీ ప్రాంతానికి ప్రతీకగా నిలిచే భద్రాచలం... ఆధ్యాత్మిక కాంతితో వెలిగినా అభివృద్ధి పరంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్న ప్రాంతం. పరిమిత మౌలిక వసతులు, ఉపాధి కొరత, వ్యవసాయం సైతం ఇతర ప్రాంతాలపై ఆధారపడే పరిస్థితులు ఇవి అక్కడి సాధారణ జీవన చిత్రణ. అయితే ఇలాంటి పరిస్థితుల్లో జన్మించిన కొందరు యువకులు తమ పట్టుదలతో న్యాయపీఠాలను అలంకరించే స్థాయికి ఎదగడం విశేషం.

- భూక్యా రంజిత్ నాయక్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజా జ్యోతి

ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి

(మొదటి పేజీ తరువాయి...)

వ్యక్తిగత సమాచారం ఆధారంగా ఫార్మర్ రిజిస్ట్రీ లో రూపొందించబడుతుం దని చెప్పారు. రెవెన్యూ శాఖ వద్ద ఉన్న భూ రికార్డులను రైతుల ఆధార్ సంఖ్యతో అనుసంధానం చేసి ఫార్మర్ ఐడీ జారీ చేయడం జరుగుతుందని వివరించారు. ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేయడం ద్వారా ఎటువంటి కొత్త చట్టబద్ధ యాజ మాన్య హక్కులు కల్పించబడవని స్పష్టం చేశారు. ఇది కేవలం ప్రభుత్వ రికా ర్డులలో ఉన్న భూ వివరాలను ప్రామాణికంగా తీసుకొని రైతులకు ప్రత్యేక గుర్తింపు సంఖ్యను అందించడానికి మాత్రమే ఉపయోగపడుతుందని తెలి పారు. కేంద్ర ప్రభుత్వ పథకాల అమలులో భాగంగా ఫార్మర్ రిజిస్ట్రేషన్‌ను అను సంధానం చేయడం జరుగుతుందని, ముఖ్యంగా పీఎం కిసాన్ పథకం తదు పరి విడతల లబ్ధి పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు తప్పనిసరిగా ఉండా లని కేంద్ర ప్రభుత్వం మార్గదర్శకాలు జారీ చేసినట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలం సీజన్ నుంచి రాష్ట్ర ప్రభుత్వ పథకాలు అయిన రైతు భరోసా, రుణ మాఫీ, మొక్కజొన్న, పత్తి, ధాన్యం కొనుగోలు, యూరియా, ఇతర ఎరువుల పంపిణీకి ఫార్మర్ రిజిస్ట్రేషన్ తప్పనిసరి అవుతుందని తెలిపారు. రైతులు తమ ఆధార్ కార్డు, భూ యాజమాన్య పాస్‌బుక్, ఆధార్‌కు అనుసంధానమైన మొబైల్ నంబర్‌తో సమీపంలోని వ్యవసాయ అధికారి లేదా వ్యవసాయ విస్త రణ అధికారిని సంప్రదించవచ్చని, లేక సమీప మీ సేవ కేంద్రాలను సంప్రదించి వెంటనే ఫార్మర్ ఐడీ నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సూచించారు. వ్యవసాయ శాఖ అధికారులు, మీసేవ కేంద్రాల వారు తమ పరిధిలోని ప్రతి రైతుకు అవగాహన కల్పించి, రిజిస్ట్రేషన్ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేయిం చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు.

భద్రాద్రిలో వైభవంగా గోదావరి నది హారతి

(మొదటి పేజీ తరువాయి...)

భద్రాచలంలో గోదావరి కరకట్ట ప్రదేశాలలో జరిగిన నదీహారతి కార్యక్రమ ములో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ సీతా రామచంద్రస్వామి కొలువై ఉన్న ప్రదేశంలోని గోదావరి తీరంలో ప్రతి ఆది వారం గోదావరి నదికి భక్తుల సహాయ సహకారాలతో భద్రాద్రి బ్రాహ్మణ పురో హిత సంఘం ఆధ్వర్యంలో గోదావరి హారతి నిర్వహించడం చాలా సంతో షంగా ఉందని, దేశ విదేశాల నుండి వచ్చే భక్తులు నదిహారతి కార్యక్రమంలో పాల్గొని పునీతులు అవుతున్నారని అన్నారు. అనంతరం పురోహితులు గోదా వరి హారతి విశేషాలను ముందుగా వినిపించి, గణపతి పూజ, జైశ్రీరామ్ అలం కారంలో 108 ప్రమిదలతో దీపోత్సవం భక్తులనే స్రుశింప చేసి పూజా ద్రవ్యా లతో గోదావరి నదికి అష్టోత్తర శతనామార్చన చేశారని, పురోహితులు శ్రీరామ అష్టోత్తరం పటిస్తుండగా ఓం శ్రీ రామాయ నమః అంటూ 108 సార్లు భక్తులచే శ్రీరామ నామ భజన చేసిన అనంతరం ముందుగా సీతారామచంద్ర స్వామి వారికి 12 సార్లు హారతి ఇచ్చిన ఆనంతరం గోదావరి నదికి 21 సార్లు హారతిఇవ్వడం జరిగిందని, లోక కళ్యాణార్థం ప్రతి ఆదివారం నిర్వహిస్తున్న ఈ మహాత్కార్యంలో గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, రామాను గ్రహంతో గోదావరి మాత ఆశీస్సులు పొందాలని ఆయన అన్నారు. అనం తరం శాంతి మంత్ర పఠనం జరిపి, చావ లక్ష్మీనారాయణ దంపతులు మరియు బూసి రెడ్డి అంకిరెడ్డి ఆధ్వర్యంలో పులిహోర ప్రసాదం నైవేద్యం భక్తులకు పంపిణీ చేయడం జరిగిందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో పురోహి తులు సురేష్ వర్మ, రామాచార్యులు, తేజ శర్మ, ప్రసాద్ శర్మ, ఫణి కుమార్ మరియు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

కొత్తగూడెం కాంగ్రెస్‌లో అసంతృప్తి జ్వాలలు

(మొదటి పేజీ తరువాయి...)

కలిగించాయి. ఈ పరిణామాలు జిల్లాలో పార్టీ ఐక్యతపై ప్రభావం చూపే అవ కాశం ఉందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అసంతృప్తి వ్యక్తం చేస్తున్న సీనియర్ నేతలను పార్టీ ఉన్నత నాయకత్వం బుజ్జగిస్తుందా లేదా అన్నది కీలకంగా మారింది. అంతర్గత విభేదాలను సర్దుబాటు చేసి పార్టీని బలోపేతం చేసే దిశగా చర్యలు తీసుకుంటారా లేక ఈ విభేదాలు మరింత పెరిగి పార్టీ ప్రతిష్టకు భంగం కలిగిస్తాయా అన్నది వేచి చూడాల్సిన పరిస్థితి నెల కొంది. కాంగ్రెస్ పార్టీలో అంతర్గత కుమ్ములాటలు తలెత్తే సూచనలు కనిపిస్తు న్నాయి. ఈ విభేదాలను అధిగమించి పార్టీ శ్రేణులు ఒకే దిశగా ముందుకు సాగుతాయా లేదా అన్నది రాబోయే రోజుల్లో తేలనుంది.

››› పార్టీని నమ్ముకున్న వారికి మొండి చెయ్యి

కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న వారికి మొండి చెయ్యి చూపుతున్నారన్న విమ ర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా కమిటీల నియామకాల అనంతరం అసంతృప్తి ఉవ్వెత్తున ఎగసిపడుతోంది. పదవులు దక్కని సీనియర్ నేతలు, కష్టపడి పనిచే సిన కార్యకర్తలు బహిరంగంగానే ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అసంతృప్తి నేతలను బుజ్జగించేందుకు పార్టీ పెద్దలు రంగంలోకి దిగాల్సిన పరి స్థితి ఏర్పడింది. లేకపోతే ఈ అసంతృప్తి మరింత ముదిరి పార్టీకి దెబ్బ తగిలే ప్రమాదం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఇప్పుడు రాష్ట్ర నాయకత్వం వెంటనే స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకువస్తుందా? లేక అసంతృప్తి అగ్ని మరింత రగిలి పార్టీ ఐక్యతను దెబ్బతీస్తుందా? అన్నది ఆసక్తి కరంగా మారింది.

భగభగమంటున్న సూరీడు...!

- సూర్య ప్రతాపానికి నల్ల సూరీల్లు విలవిల
- నిప్పుల కొలిమిని తలపిస్తున్న బొగ్గు గనులు
- గనుల్లో 50 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదు...!
- పని వేళలు మార్చాలని కార్మిక సంఘాల డిమాండ్
- అత్యవసర హెచ్చరికలు జారీ చేసిన వాతావరణ శాఖ
- మధ్యాహ్నం వేళ నిర్మానుష్యంగా దర్శన మిస్తున్న రోడ్లు

సూరీడు సెగలు కక్కుతూ భగభగమంటు న్నాడు. రోజు రోజుకు నియోజకవర్గంలో పె రుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం బెంబేలెత్తు తున్నారు. మణుగూరు సింగరేణి ఉపరితల బొగ్గు గనుల్లో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్ర తలు నమోదు అవుతున్నాయని, పని వేళలు మార్చాలని పలు కార్మిక సంఘాలు గొల్లుమంటున్నాయి. యాజమాన్యానికి అధిక ఉత్పత్తిపై ఉన్న శ్రద్ధ కార్మికుల రక్షణపై లేదని కార్మిక సంఘాలు మండిపడుతు న్నాయి. మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇచ్చి చేతులు దులుపుకోవడం రక్షణ చర్యలు ఎలా అవుతాయని ప్రశ్నిస్తు న్నారు. వేసవి వేడిమితో బొగ్గు గనులు నిప్పుల కొలిమిని తలపిస్తున్నాయి. దీంతో కార్మికులు విలవిలలాడుతుంటే దానిని దృష్టిలో ఉంచుకొని అందుకు తగ్గట్టు మొదటి షిఫ్ట్, రెండవ షిఫ్ట్ పనివేళలు మార్పు చేయాలని పలువురు కార్మిక నాయకులు డిమాండ్ చేస్తున్నారు.

● మణుగూరు, ప్రజాజ్యోతి

ఉపరితల గనుల వద్ద 48 డిగ్రీల నుండి 50డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండడంతో పనులు చేయ లేక సింగరేణి కార్మికులు, కాంట్రాక్టు కార్మికులు తీవ్ర ఇబ్బంది పడుతు న్నారు. పారిశ్రామిక ప్రాంతం కావ డంతో ఇక్కడ ఇతర ప్రాంతాల కన్నా ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. మధ్యహ్నమైతే భానుడు తారెత్తిస్తుం డటంతో 50 ఏళ్లకు పైబడిన కార్మి కులు, అధికారులు అధికంగా ఉండ డంతో క్వారీల్లో కార్మికులు తీవ్రమైన ఇబ్బందులకు గురవుతూ బెంబేలెత్తు తున్నారు. గత వారం రోజులుగా రాష్ట్రంలో అధిక ఉష్ణోగ్రతలు నమోద వుతున్న కారణాన వేసవి వేడిమికి హడలెత్తి ప్రజలు ఇళ్లకే పరిమితమవు తున్నారు. కానీ దేశంలో వెలుగులు నింపే చీకటి సూరీల్లు మాత్రం వడ కాటుకు బలవుతున్నారు. ఇంత జరు గుతున్నా యాజమాన్యం మాత్రం చోద్యం చూస్తూ... పని వేళలు మార్చ కపోవడం గమనార్హం.

50 డిగ్రీల ఉష్ణోగ్రత దాటితే లే ఆఫ్ ప్రకటించాలి...

నిబంధనల ప్రకారం ఉపరితల గనుల్లో 50 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్ర తలు దాటితే యాజమాన్యం లే ఆఫ్ ప్రకటించాలి. కానీ 50 డిగ్రీల లోపే ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని యాజమాన్యం చూపిస్తుందని పలు కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. వాస్తవానికి ఉపరితల బొగ్గ గనుల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతు న్నాయని కార్మిక సంఘాల నాయ కులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సింగరేణి వ్యాప్తంగా ప్రతీ సంవత్సరం ఉత్పత్తి ఉత్పాదకాలలో మణుగూరు ఏరియాను ముందు వరుసలో ఉంచే కార్మికుల ఆరోగ్యం పట్ల యాజ మాన్యం చొరవచూపి పని వేళలు మార్చాలని కార్మిక నాయకులు అంటున్నారు. పనివేళల మార్పులో భాగంగా మొదటి షిఫ్ట్ ఉదయం 6 నుండి 12గంటల వరకు అలాగే రెండవ షిఫ్ట్ సాయంత్రం 4 నుండి 11గంటల వరకు పని వేళలు మార్చా లని కార్మిక సంఘాల నేతలు ముక్తకం ఠంతో కోరుతున్నారు. తక్షణమే యాజమాన్యం స్పందించి కార్మికుల శ్రేయస్సును, సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని పని వేళలు మార్పు చేసి, పనిచేసుకునేలా మంచి వాతావర ణాన్ని కల్పించాలని పలువురు కోరు తున్నారు. అంతేకాకుండా ఉపరితల గనుల వద్ద ఏసీ సౌకర్యంతో రెస్ట్ షెల్టర్స్ ఏర్పాటు చేసి, మైన్స్ సేఫ్టీ డైరె క్టర్ జనరల్ ఆదేశాలను అమలు చేయాలని అంటున్నారు. అలాగే మజ్జిగ ప్యాకెట్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, చల్లటి నీరు ఎప్పటికప్పుడు అందుబా టులో ఉండే విధంగా ఏర్పాట్లు చేయా లని పలు కార్మిక సంఘాల నాయ కులు యాజమాన్యానికి వినతి పత్రాల ద్వారా విన్నవించుకుంటు న్నారు.

అత్యవసర హెచ్చరికలు జారీ...

ఏప్రిల్ 19 నుండి మే 31 వరకు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3గంటల వరకు ఎవరూ బయటకు వెళ్లకూడదు, ప్రత్యేకంగా బహిరంగ ప్రదేశాలకు. ఎందుకంటే ఉష్ణోగ్రత 45 నుండి 55 డిగ్రీల వరకు పెరగవచ్చని వాతావరణ శాఖ తెలి పింది. ఈ సమయంలో భూమి మీద నేరుగా 70 శాతం అతినీలలోహిత సూర్య కిరణాలు ప్రసరిస్తాయి. ఎవరి కైనా శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది లేదా అకస్మాత్తుగా అస్వస్థత కలిగితే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని గాలి సరిగా వచ్చేలా గదుల తలుపులు తెరిచి ఉంచాలని నిపుణులు సూచిస్తు న్నారు. ఎండలో మొబైల్ వినియో గాన్ని వీలైనంత వరకు తగ్గించుకుంటే మంచిది. అధిక వేడి కారణంగా మొబైల్ పేలే ప్రమాదం ఉందని సివిల్ రక్షణ విభాగం అధికారులు హెచ్చరి స్తున్నారు. పెరుగు, మజ్జిగ, నిమ్మ రసం వంటి చల్లని పానీయాలను ఎక్కువగా తీసుకోవాలని వైద్య నిపు ణులు సూచిస్తున్నారు. ఎక్కువగా నీరు మరియు ద్రవాలు త్రాగాలని, గ్యాస్ సిలిండర్‌ను ఎండలో ఉంచ వద్దు, విద్యుత్ మీటర్లపై అధిక లోడ్ వేయవద్దు, ప్రతీ 2, 3 గంటలకు కనీసం 30 నిమిషాలు విశ్రాంతి తీసు కోవాలని పౌర రక్షణ విభాగం హెచ్చ రిస్తోంది.

నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న రోడ్లు...

మధ్యాహ్నం వేళ రోడ్లన్నీ నిర్మాను ష్యంగా దర్శనమిస్తున్నాయి. నియోజ కవర్గ వ్యాప్తంగా అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో అడుగు బయట పెట్టాలంటే జనం జంకుతు న్నారు. భానుడి భగభగలతో జనం హడలెత్తుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రజలు ఉక్కపోత, వడగాలులతో ఉక్కిరిబిక్కిరౌతూ వడదెబ్బకు పిట్టల్లా రాలిపోతున్న సంఖ్య పెరుగుతోంది. ఇటీవల కే.సీ.హెచ్.పి లో అధిక ఉష్ణోగ్రత కారణంగా ఎండ వేడిమికి టిప్పర్ దగ్ధమైంది. పినపాక నియోజ కవర్గంలో గత నాలుగైదు రోజులుగా 44 డిగ్రీల నుండి 48 డిగ్రీల రికార్డు ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఏప్రిల్, మే మాసమంతా ఎండల తీవ్రత అధికంగా ఉంటుందని హైద రాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరి స్తోంది. కాబట్టి అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి ఎవరూ ఎండలకు బయ టకు రావద్దని వైద్య నిపుణులు సూచి స్తున్నారు.

ప్రకృతి ప్రేమికుడు బాలు

- వృత్తి – ఉపాధ్యాయుడు
- ప్రవృత్తి – సమాజ సేవా
- పర్యావరణ పరిరక్షణలో విశేష కృషి
- అభాగ్యులకు అన్నదానం చేస్తూ పలువురి మన్ననలు పొందుతున్న బాలు
- అవార్డులు రివార్డులు బాలు కె సొంతం

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 19, (ప్రజాజ్యోతి)

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు విద్యా బోధన చేయడంలోనే కాకుండా, సామాజిక సేవా కార్యక్రమాలలో నూ తనదైన ముద్ర వేసుకున్నాడు మా లోత్ బాలు , పాల్వంచ మండల పరిధి లోని మోడల్ స్పోర్ట్స్ పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న బాలు కరోనా మహమ్మారి సమయంలో అనేక కుటుంబాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పుడు, వారికి సాయం అందించి, "నేను ఉన్నాను" అని ధైర్యం చెప్పి ఉపాధ్యాయ లోకానికి ఆదర్శం గా నిలిచారు. భద్రాద్రి కొత్తగూడెం జి ల్లా లోని విద్యార్థులకు, యువతకు వి ద్యా – ఉద్యోగ మార్గదర్శకత్వం చేస్తూ, ఎవరికి అవసరమైతే వారికి సలహాలు, సూచనలు అందిస్తూ పలువురి విద్యార్థుల మేలు కోరే విధంగా అనేక సహాయ సహకారాలు అందిస్తూ వస్తున్నారు, "పేరుకే ఉపాధ్యాయుడిని కానీ, నిత్య విద్యార్థిని" అని చెప్పే ఆయన చిన్నా – పెద్దా తేడా లేకుండా అందరినీ గౌరవించడం ఆయన వ్యక్తిత్వంలోని ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది. "మొక్క వృక్షమై పెరిగి నీడ, గాలి ఇస్తే మనిషి కూడా సమాజానికి ఉపయోగపడాలి" అన్న బాలు మాటలు సమాజ సేవా పట్ల ఉన్న మక్కువను ప్రతిబింబిస్తాయనీ చెప్పవచ్చు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలం, సర్వారం గ్రామంకు చెందిన బాలు చిన్నప్పటి నుంచే సేవాభావంతో పెరిగారు. 2000లో స్పెషల్ గ్రేడ్ టీచర్‌గా ఉద్యోగంలో చేరి, 2012లో ఆంగ్ల ఉపాధ్యాయుడిగా పదోన్నతి పొందారు. ప్రస్తుతం పాల్వంచ మండలంలోని మోడల్ స్పోర్ట్స్ స్కూల్, కిన్నెరసానిలో స్కూల్ అసిస్టెంట్ ఆంగ్ల ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహి తన వృత్తిలో ఉత్తమతకు గుర్తింపుగా ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారుల నుండి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందుకున్నారు. పర్యావరణ పరిరక్షణలో చేస్తున్న కృషికి గాను 2024లో సర్దార్ వల్లభభాయ్ పటేల్ జాతీయ అవార్డు, గౌతమ బుద్ధ చక్రవర్తి,2025 లో హైదరాబాద్ నెహ్రూ ఆడిటోరియంలో తెలంగాణ జల మండలి చైర్మెన్ అశోక్ రెడ్డి ఐఏఎస్ చేతుల మీదుగా పర్యావరణ పరిరక్షణ విభాగంలో యంగ్ ఇండియన్ సేవా జాతీయ పురస్కారమును బాలు అందుకున్నారు, కరోనా సమయంలో రక్తదానం శిబిరాలు, అంబులెన్స్ సేవలు, మాస్కుల పంపిణీ, పేద కుటుంబాలకు ఆహార పంపిణీ వంటి సేవా కార్యక్రమాలతో ప్రజల మనసు గెలుచుకున్నారు. ప్రస్తుతం ఐక్య తల్లిదండ్రుల సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏటిఇసి జిల్లా అధ్యక్షుడుగా పలు బాధ్యతలు నిర్వహిస్తూ పేదవారికి, అన్నార్థులకు నిత్యాన్నదానం కార్యక్రమం నిర్వహిస్తూ, సమాజంలో "మొక్కల బాలు"గా ప్రసిద్ధి పొందారు. పాఠశాలల్లో మొక్కల పెంపకం పై చేస్తున్న కృషిని ఐటిడిఏ అధికారులు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇది ఇలా ఉండగా ఇటీవల బాలు పాఠశాలలో ఇంగ్లీష్ బంతి పూలను విత్తనాలు వేసి నాటగా వేసవికాలంలో కూడా అవి విరబూసి కాసాయి, ఉపాధ్యాయ వృత్తి, సమాజ సేవ, పర్యావరణ పరిరక్షణలో ఆయన చేసిన కృషి కొనసాగాలని అందరూ ఆకాంక్షిస్తున్నారు.

ప్రజావాణికి అధికారులు సకాలంలో హాజరు కావాలి

- జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 19,(ప్రజాజ్యోతి) సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమానికి అన్ని శాఖల జిల్లా అధికారులు సకాలంలో హాజరుకావాలని జిల్లా కలెక్టర్ అంకిత్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ తమ సమస్యలకు సంబంధించిన అంశాలపై లిఖితపూర్వక ఫిర్యాదులను సమర్పించాలని సూచించారు.ఉదయం 10.30గంటలకు ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమవుతుందని కావున సంబంధిత శాఖాధికారులు ప్రజల నుండి అందిన ఫిర్యాదులను వెంటనే స్వీకరించి, తగిన చర్యలు తీసుకునేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

లక్ష్మీదేవిపల్లిలో పువ్వాడ అజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా

లక్ష్మీదేవిపల్లి, ఏప్రిల్ 19 (ప్రజాజ్యోతి) మాజీ మంత్రి, బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు పువ్వాడ అజయ్ కుమార్ జన్మదిన వేడుకలను లక్ష్మీదేవిపల్లి మండలంలో ఘనంగా నిర్వహించారు. మండల అధ్యక్షుడు కొట్టి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎదురుగడ్డలో కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు మాట్లాడుతూ పువ్వాడ అజయ్ కుమార్ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎదురుగడ్డ సురేష్, గట్టు మల్ల సర్పంచ్ బట్టు కనకరాజు, ప్రశాంతినగర్ వార్డు సభ్యుడు శ్రీకాంత్ నాయక్, మాజీ ఉపసర్పంచ్ వినోద్, మాజీ సర్పంచ్ తాడూరి రజాక్, మాజీ వార్డు సభ్యులు పొదిలి వెంకటాచలం, ప్రవీణ్, పార్టీ ప్రచార కార్యదర్శి లావుడియా వెంకటేష్, తరాల దాము, చిన్న నాయక్, పోకల నగేష్, బోసు శివ, కారుకొండ రాజు, చిన్ని సందీప్, ప్రదీప్, బట్టు రవి, హుస్సేన్, కొంపల్లి వెంకన్న, పూర్ణాచారి, రాంజీ, మహేష్ పింకీ, శేఖర్, జగదీష్, లాల్ తండా శ్రీను తదితరులు పాల్గొన్నారు.

పువ్వాడ అజయ్ కుమార్ జన్మదిన వేడుకలు

కొత్తగూడెం, ఏప్రిల్ 19 (ప్రజాజ్యోతి) మాజీ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ జన్మదిన వేడుకలను బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. రైల్వే స్టేషన్ వద్ద కేక్ కట్ చేసి అనంతరం అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా మాజీ కౌన్సిలర్ బీమా శ్రీధర్ మాట్లాడుతూ కొత్తగూడెం నియోజకవర్గంలో బిఆర్ఎస్ పార్టీ బలంగా ఉందని పార్టీని ఎదుర్కొనే శక్తి ఇతరులకు లేదన్నారు. ఎంపీ వద్దిరాజు రవిచంద్ర ఆధ్వర్యంలో పార్టీ సమర్థంగా పనిచేస్తోందని తెలిపారు. పార్టీ కార్యకర్తలకు ఎలాంటి ఇబ్బందులు వచ్చినా ఎంపీ అండగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్పర్సన్ కాపు సీతామహాలక్ష్మి , మాజీ ఎంపీపీ బాధవత్ శాంతి, మాదాసు పద్మ, డీకొండ సునీత, కార్పొరేటర్ బీమా శ్రీవల్లి, సాగర్, మాజీ కౌన్సిలర్ రుక్మాంగాధర్ భండారి, అంబుల వేణు, బొమ్మిడి రమాకాంత్, బొమ్మిడి శ్రీకాంత్, ఎండి రఫీ, గోపి, కాసుల కిరణ్, పాషా, మద్దెల సుధీర్, జూలూరి రాజేష్, వేమూరి శివ, బి. శ్రీను, బొందుగుల శ్రీధర్, అహ్మద్, కరాటే శ్రీనివాస్, సునీల్, గంగాధర్, ఉప సర్పంచ్ దుర్గేష్, రమేష్ గౌడ్, చుంచుపల్లి మండల సర్పంచ్ లు శ్రీకాంత్, బలరాం, కన్ని, సుజాతనగర్ నాయకుడు జగన్ తదితరులు పాల్గొన్నారు.

పెర్టిలైజర్స్ అసోసియేషన్ అధ్యక్షులుగా తిరు కొల్లూరి వెంకటేశ్వర్ల

గుండాల. మార్చి. 19. ప్రజాజ్యోతి వ్యాపారం తో పాటు ప్రజలకు సేవ చేయాలని తద్వారా ప్రజలలో మంచి పేర్లు సంపాదించుకుంటామని నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు తిరుక్కుళ్లూరి వెంకటేశ్వర్లు అన్నారు ఆదివారం మండల కేంద్రంలోని రైతు వేదికలో జరిగిన సీడ్స్ ,& ఫెర్టిలైజర్స్ & పెట్టి సైడ్స్, అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశం ఉద్దేశించి ఆయన మాట్లాడారు . వ్యాపారులంతా సమన్వయంతో సామరస్యంగా కలిసి పని చేయాలని కోరారు. అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో వివిధ విషయాలపై చర్చించిన అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు కమిటీ అధ్యక్షులుగా తిరుకుల్లూరి వెంకటేశ్వర్లు (పట్వారి వెంకన్న) కార్యదర్శిగా మానాల ప్రభాకర్, కోశాధికారిగా మాదే మంగయ్య, గౌరవ అధ్యక్షులుగా మానాల వెంకటేశ్వర్లు, ఉప అధ్యక్షులుగా చాట్ల సూర్యనారాయణ, బిచ్చల వీరస్వామి, జాయింట్ సెక్రటరీగా పెంటి వేణు, ఈజీగా పాయం భూషణం ఈసం రాజబాబు లను ఎన్నుకున్నారు ఈ కార్యక్రమంలో పాయం నాగభూషణం గుగ్గిల సుందర్రావు సనప సుధాకర్ కొడెం రమేష్ ఎట్టి లక్ష్మీనారాయణ నవీన్ తదితరులు పాల్గొన్నారు

విదేశీ ఉద్యోగాలకు మైనారిటీలు దరఖాస్తు చేసుకోండి

- మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యండి. యాకుబ్ పాషా



కొత్తగూడెం కలెక్టరేట్, ఏప్రిల్ 19, (ప్రజా జ్యోతి) రాష్ట్రంలోని మైనారిటీ నిరుద్యోగ యువత, విదేశీ ఉద్యోగావకాశాలను సద్వినియోగం చేసుకోవాలని మైనారిటీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యండి. యాకుబ్ పాషా తెలిపారు ,ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ ఓవర్సీస్ మాన్‌పవర్ కంపెనీ (టి.ఓ.ఎం.కాం) ఆధ్వర్యంలో గల్ఫ్ తో పాటు ఇతర దేశాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాల భర్తీ చేయడం జరుగుతుందని తెలిపారు. ముఖ్యంగా ఖతార్, దోహా, గ్రీస్ , సౌదీ అరేబియా, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూ.ఏ.ఈ) వంటి దేశాల్లో నర్సింగ్, టెక్నికల్, డ్రైవింగ్, హాస్పిటల్ స్టాఫ్ విభాగాల్లో మంచి అవకాశాలు ఉన్నాయని ఐటిఐ, డిప్లొమా, ఇంజనీరింగ్, జీఎన్ ఎం/ బీఎస్సీ నర్సింగ్ ఉత్తీర్ణత కలిగి అనుభవం కలిగిన వారికి అవకాశం ఉంటుందని తెలిపారు, పైన తెలిపిన ఉద్యోగాలకు అభ్యర్థులలో ఎంపికైన వారికి ఆకర్షణీయమైన వేతనంతో పాటు ఉచిత వసతి, మెడికల్ ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలు కల్పించబడతాయని వివరించారు. నర్సింగ్ జి.ఎన్.ఎం, బి.ఎస్సి, ల్యాబ్ టెక్నీషియన్, ఎలక్ట్రిషియన్, ప్లంబర్, డ్రైవర్, హాస్పిటల్ సపోర్ట్ స్టాఫ్ వంటి ఉద్యోగాలకు డిమాండ్ ఎక్కువగా ఉందన్నారు, విదేశీ ఉద్యోగాలకు దరఖాస్తు చేసే అభ్యర్థుల వయస్సు సాధారణంగా 21 నుండి 35 సంవత్సరాల మధ్య ఉండాలని, కొన్ని టెక్నికల్ పోస్టులకు గరిష్ట వయస్సు 40 సంవత్సరాల వరకు సడలింపు ఉంటుందని తెలిపారు. అర్హత కలిగిన మైనారిటీ యువత వెంటనే తమ బయోడేటా, విద్యార్హత సర్టిఫికెట్లు సిద్ధం చేసుకుని tomcomglobal@gmail.com, tomcomresume@gmail. com ఈమెయిల్‌లకు పంపించాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 852086078 5 నంబర్లను సంప్రదించాలని యండి. యాకూబ్ పాషా తెలిపారు.ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాలను మైనారిటీ నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

ఇల్లందు ఏరియా హాస్పిటల్‌లో అద్భుతం

- ప్రాణం లేని శిశువుకు ప్రాణం పోసిన వైద్యుడు!

ఇల్లందు, ఏప్రిల్ 19, ప్రజాజ్యోతి: ఇల్లందు ఏరియా హాస్పిటల్‌లో ఒక పసిగుడ్డుకు పునర్జన్మ లభించింది. కేవలం 3 నెలల వయసు గల మగ శిశువు ఎటువంటి హృదయ స్పందన, శ్వాస లేకుండా అత్యంత క్లిష్ట స్థితిలో ఆసుపత్రికి తీసుకురావడం జరిగింది. పరిస్థితి విషమంగా ఉన్నప్పటికీ డాక్టర్ అజ్మీరా భగత్ సింగ్, వైద్య బృందం తక్షణమే అత్యవసర చికిత్సను ప్రారంభించారు. వెంటనే సిపిఆర్ ద్వారా ప్రాణవాయువును అందించారు. గుండె స్పందనను పునరుద్ధరించడానికి 3 డోసుల అడ్రినలిన్ అందించారు. వైద్యుల కృషితో శిశువు గుండె తిరిగి కొట్టుకోవడం ప్రారంభమైంది. శిశువు ఆరోగ్యం నిలకడగా ఉండడానికి తదుపరి చర్యలు చేపట్టారు. అదేవిదంగా శ్వాస ఇబ్బంది లేకుండా 3.5 ఈటి ట్యూబ్ వేసి ఏయంబియు బ్యాగ్ ద్వారా సాయం అందించారు. పసి కందు రక్త ప్రసరణ మెరుగుపరచడానికి డోపమైన్, డోబుటమైన్ మందులు వేయడం ప్రారంభించారు. ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించే క్రమంలో అంబు లెన్స్‌లో సిరంజి పంప్ ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ, శిశువును సురక్షితంగా చేర్చారు. డాక్టర్ అజ్మీరా భగత్ సింగ్, వారి నర్సింగ్ బృందం ప్రదర్శించిన సమయస్ఫూర్తి, అంకితభావం ఒక నిండు ప్రాణాన్ని కాపాడాయి. మృత్యువు అంచున ఉన్న శిశువుకు ప్రాణం పోసిన ఇల్లందు ఏరియా హాస్పిటల్ బృందాన్ని ఎమ్మెల్యే కోరం కనకయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ దొడ్డ కిరణ్ మిత్ర దానియల్, వైస్ చైర్మన్ పెండెల రాజు, డిసిహెచ్ఎస్ డాక్టర్ జి రవి బాబు, ఇల్లందు వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ జి హర్షవర్ధన్, ఆర్ యంఓ డాక్టర్ రామ్ నివాస్, వైద్యులు, పుర ప్రముఖులు అభినందించారు.

ఆర్టీసీ సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు సిద్ధం

కొత్తగూడెం, ఏప్రిల్ 19 (ప్రజాజ్యోతి) ఆర్టీసీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించకపోతే సమ్మెకు దిగాల్సి వస్తుందని ఎస్‌డబ్ల్యుఎఫ్ (సిఐటియు) నాయకత్వం హెచ్చరించింది. స్థానిక టీచర్స్ భవన్‌లో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో కార్మిక సంఘాలు, ప్రజాసంఘాల ప్రతినిధులు పాల్గొని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. ఈ సందర్భంగా సిఐటియు రాష్ట్ర అధ్యక్షుడు మందా నరసింహరావు, జిల్లా రీజియన్ నాయకులు యాస నాగేశ్వరరావు మాట్లాడుతూ ఆర్టీసీని ప్రైవేటు వ్యక్తుల చేతుల్లోకి వెళ్లనీయకుండా ప్రభుత్వం ఆధీనంలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సంక్షేమం, సంస్థ పరిరక్షణ కోసం అన్ని కార్మిక సంఘాలు ఐక్యంగా పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం సాచివేత ధోరణి అనుసరిస్తోందని విమర్శిస్తూ వేతన సవరణ చేపట్టాలని ఆర్టీసీలో కొత్త ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. కార్మిక సంఘాల ప్రాధాన్యతను గుర్తిస్తామని ఇచ్చిన హామీలను ప్రభుత్వం విస్మరించిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మికుల న్యాయమైన సమస్యలను పరిష్కరించకుండా వారే ఉద్యోగాలను వదిలే పరిస్థితి తీసుకువస్తున్నారని మండిపడ్డారు. దశలవారీగా ఆందోళనలు కొనసాగిస్తున్నామని ఐక్య పోరాటాల ద్వారానే విజయాలు సాధ్యమని స్పష్టం చేశారు. కొన్ని సంఘాలు సంప్రదింపులు లేకుండా సమ్మె నోటీసులు ఇవ్వడం సరైంది కాదని అభిప్రాయపడ్డారు. సమ్మె విజయవంతం కావాలంటే కార్మికుల్లో చైతన్యం కల్పించి ప్రజాసంఘాల మద్దతు కూడగట్టాలని సూచించారు. సమ్మెకు పిలుపునిచ్చిన కార్మిక సంఘాలకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ ఎస్‌డబ్ల్యుఎఫ్ (సిఐటియు) కూడా సంపూర్ణంగా భాగస్వామ్యం అవుతుందని తెలిపారు. ఆర్టీసీ పరిరక్షణ కోసం జేఏసీ ఆధ్వర్యంలో ఐక్యంగా సమ్మెకు దిగాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి భూక్య రమేష్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి సతీష్ కుమార్, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి కందగట్ల సురేందర్, సహాయ కార్యదర్శి గౌను నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు నాగకృష్ణ తదితరులు పాల్గొని సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఎస్‌డబ్ల్యుఎఫ్ కొత్తగూడెం డిపో అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు అధ్యక్షత వహించారు. కార్మికులు కుమార్, కేశవరావు, వెంకటేశ్వర్లు, నజీర్, పి.ఎల్.రావు, సతీష్, రాంబాబు, శంకర్ తదితరులు హాజరయ్యారు.

శ్రీరాముడిపై అవమానకర వ్యాఖ్యలపై సినీ నటుడు ప్రకాష్ రాజ్ పై ఫిర్యాదు

భద్రాచలం టౌన్ , ఏప్రిల్ 19 , ప్రజాజ్యోతి, భద్రాచలం పట్టణానికి చెందిన బీజేపీ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు కుంజా ధర్మారావు ఆధ్వర్యంలో సినీ నటుడు ప్రకాష్‌రాజ్ పై ఆదివారం భద్రాచలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇటీవల పవిత్ర హిందూ ఇతిహాసమైన రామాయణంకు సంబంధించిన వ్యాఖ్యలలో, శ్రీరాముడు ఉత్తర భారతీయుడని, రామ–లక్ష్మణ–సీతలు లంకలో పండ్లు దొంగతనం చేయడం వలన యుద్ధం జరిగిందని చేసిన వ్యాఖ్యలు తీవ్ర అభ్యంతరకరంగా ఉన్నాయని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలు హిందువుల మనోభావాలను దెబ్బతీసే విధంగా ఉండటమే కాకుండా, భద్రాచలం వంటి దక్షిణ అయోధ్యగా ప్రసిద్ధి చెందిన ప్రాంతంలో సామాజిక సమైక్యతకు భంగం కలిగించే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కాబట్టి ప్రకాష్ రాజ్ పై వెంటనే కేసు నమోదు చేసి అందుబాటులో ఉన్న వీడియోలు, సోషల్ మీడియా పోస్టులు మరియు ఇతర ఆధారాలను పరిశీలించి, చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు కుంజా ధర్మా, కుంజా సంతోష్, ముత్యాల శ్రీనివాస్, నిడదవోలు నాగబాబు, ములిశెట్టి రాంమోహన్ రావు, ఆవుల సుబ్బారావు, బోడ సత్యనారాయణ పాల్గొన్నారు.

భద్రాద్రి రామయ్యకు అభిషేకం, స్వర్ణ పుష్పార్చన

- అధిక సంఖ్యలో స్వామి వారిని దర్శించుకున్న భక్తులు

భద్రాచలం టౌన్, ఏప్రిల్ 19 , ప్రజాజ్యోతి, భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి వారికి ఆదివారం ఆర్జిత సేవల్లో భాగంగా ప్రత్యేక అభిషేకం, పుష్పార్చన నిర్వహించారు. అలాగే సెలవుదినం కావడంతో రామాలయంలో భక్తులు అధికంగా దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచే భక్తులు స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్లో వేచి ఉన్నారు. మధ్యాహ్నం వరకు క్యూలైన్లన్నీ భక్తులతో కిక్కిరిసాయి. అలాగే నిత్యకల్యాణ మండపంలో స్వామి వారి నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. కల్యాణ ప్రక్రియలో భాగంగా విశ్వక్సేనార్చన, పుణ్యాహవచనం, కంకణదారణ, జీలకరబెల్లం, మాంగల్యదారణ, వేద ఆశీర్వచనం నిర్వహించారు.

బీఆర్ఎస్ ఆధ్వర్యంలో మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలు

భద్రాచలం టౌన్, ఏప్రిల్ 19 , ప్రజాజ్యోతి, భద్రాచలంలో ఆదివారం మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించారు.కొత్త మార్కెట్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం ఆవరణలో భద్రాచలం డివిజన్‌కు చెందిన నాయకులు, కార్యకర్తలు, అభిమానుల సమక్షంలో కేక్ కట్ చేసి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకులు రావులపల్లి రాంప్రసాద్, మానె రామకృష్ణతో పాటు భద్రాచలం, దుమ్ముగూడెం, చర్ల మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సరోజ వృద్ధాశ్రమంలో అన్నదానం

భద్రాచలం టౌన్, ఏప్రిల్ 19, ప్రజాజ్యోతి, భద్రాచలంలోని సరోజ వృద్ధాశ్రమంలో ఆదివారం ఆల్ పెన్షనర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. అసోసియేషన్ డివిజన్ అధ్యక్షులు బంధు వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో దర్శి శ్రీరామమూర్తి 16వ వర్ధంతి సందర్భంగా ఆశ్రమంలోని వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. అదేవిధంగా వృద్ధాశ్రమ నిర్వాహకురాలు సరోజను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎం.హరినాథ్, జి.మురళీకృష్ణ, సుబ్రమణ్యం, చుక్క రాంబాబు, రామరాజు, కిషన్‌రావు, నాళం సత్యనారాయణ పాల్గొన్నారు.

గురుకులం సీఈవోలో ప్రవేశాలకు ప్రతిభ పరీక్ష విజయవంతం

భద్రాచలం టౌన్, ఏప్రిల్ 19 , ప్రజాజ్యోతి, తెలంగాణ గిరిజన గురుకుల సి ఓ ఈ కళాశాలలో ప్రవేశం కొరకు నిర్వహించిన ప్రతిభ ప్రవేశ పరీక్షలు విజయవంతంగా ముగిశాయని గురుకులం ఆర్ సి ఓ పరీక్షల పరిశీలన అబ్జర్వర్ అరుణకుమారి అన్నారు. ఆదివారం భద్రాచలంలోని సి ఓ ఈ కళాశాలలో జరుగుతున్న ప్రవేశ పరీక్షా కేంద్రాలను ఆమె తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో మొత్తం ఐదు సెంటర్లలో ప్రతిభా ప్రవేశ పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని, వాటిలో ప్రతిభ పాఠశాల ఖమ్మం, దమ్మపేట, సుదిమళ్ల, భద్రాచలం గురుకుల కళాశాలల్లో ప్రవేక్ష పరీక్ష నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ఐదు పరీక్షా కేంద్రాలలో 1692 మంది విద్యార్థినీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా , 1468 మంది పరీక్ష రాసేందుకు హాజరైనారని తెలిపారు. ఈ పరీక్షలు అన్ని సెంటర్లలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రశాంతమైన వాతావరణంలో జరిగాయని అన్నారు.

- న్యాయపీఠాన్ని అలంకరించిన భద్రాద్రి ప్రతిభలు
- ఏజెన్సీ నేల నుంచి హైకోర్టు వరకు ప్రస్థానం
- కష్టాలు జయించి న్యాయరంగంలో విశిష్ట స్థానాలు
- యువతకు ఆదర్శంగా నిలుస్తున్న విజయ గాథలు
- భద్రాచలం పేరును దేశవ్యాప్తంగా చాటిన న్యాయమూర్తులు

మారుమూల నుంచి మహోన్నతం వరకు...

ఏజెన్సీ ప్రాంతానికి ప్రతీకగా నిలిచే భద్రాచలం... ఆధ్యాత్మిక కాంతితో వెలిగినా అభివృద్ధి పరంగా ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్న ప్రాంతం. పరిమిత మౌలిక వసతులు, ఉపాధి కొరత, వ్యవసాయం సైతం ఇతర ప్రాంతాలపై ఆధారపడే పరిస్థితులు ఇవి అక్కడి సాధారణ జీవన చిత్రణ. అయితే ఇలాంటి పరిస్థితుల్లో జన్మించిన కొందరు యువకులు తమ పట్టుదలతో న్యాయపీఠాలను అలంకరించే స్థాయికి ఎదగడం విశేషం.

- భూక్యా రంజిత్ నాయక్,భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, ప్రజా జ్యోతి

మౌలిక వసతుల కొరత,పరిమిత అవకాశాలు, సీజన్‌పై ఆధారపడి జీవించే ఆర్థిక వ్యవస్థ ఇలాంటి సవాళ్ల మధ్య పెరిగిన భద్రాచలం ఏజెన్సీ ప్రాంత యువతలో కొందరు తమ కృషి, పట్టుదలతో అసాధారణ విజయాలను సొంతం చేసుకుంటున్నారు. మారుమూల ప్రాంతం నుంచి బయలుదేరి న్యాయపీఠాన్ని అలంకరించే స్థాయికి ఎదిగిన ఈ ప్రతిభలు భద్రాద్రి నేల సామర్థ్యాన్ని దేశానికి చాటుతున్నాయి.

క్రమశిక్షణతో శిఖరాగ్రం – జస్టిస్ నగేశ్ భీమపాక

స్థానిక పాఠశాలల నుంచే లక్ష్యసాధనలో స్థిరత్వం చూపిన జస్టిస్ నగేశ్ భీమపాక, ఉన్నత న్యాయ విద్యతో తన ప్రస్థానాన్ని బలపరిచారు. న్యాయవాదిగా ప్రారంభించి, ప్రభుత్వ ప్లీడర్‌గా కీలక బాధ్యతలు నిర్వర్తించి, తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఎదగడం ఆయన కృషికి నిదర్శనం. భద్రాచలం ప్రాంతానికి చెందిన జస్టిస్ నగేశ్ భీమపాక న్యాయరంగంలో విశిష్ట సేవలందిస్తూ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా ఉన్నత స్థానం అధిరోహించారు. 1969 మార్చి 8న భీమపాక భూపతి రావు, శాంతమ్మ దంపతులకు భద్రాచలంలో జన్మించిన ఆయన విద్యాభ్యాసాన్ని స్థానికంగానే పూర్తి చేసి, ఖమ్మంలోని డాక్టర్ జయచంద్ర రెడ్డి జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, అనంతరం ఏలూరులోని సి.ఆర్. రెడ్డి లా కాలేజీలో న్యాయ పట్టా పొందారు. హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని ఓయూ పీజీ లా కాలేజీలో అంతర్జాతీయ న్యాయంలో ఎల్.ఎల్.ఎం పూర్తి చేశారు. 1993 ఏప్రిల్ 21న న్యాయవాదిగా నమోదు అయిన ఆయన భద్రాచలంలో ఎం.వి. రమణారావు చాంబర్స్‌లో ప్రాక్టీస్ ప్రారంభించి సివిల్, క్రిమినల్, ఏజెన్సీ చట్టాల్లో ప్రావీణ్యం సంపాదించగా, 1996లో ఆంధ్రప్రదేశ్ హైకోర్టులో సి. దామోదర్ రెడ్డి కార్యాలయంలో చేరి అనుభవాన్ని విస్తరించారు. 2004లో పలు శాఖలకు అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్‌గా, అనంతరం జీహెచ్ఎంసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా, 2014లో ఇండస్ట్రీస్, కామర్స్, మైన్స్ విభాగాలకు గవర్నమెంట్ ప్లీడర్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. 2017లో స్వతంత్ర న్యాయవాదిగా ప్రాక్టీస్ కొనసాగిస్తూ మెడికల్, హెల్త్, ఫ్యామిలీ వెల్ఫేర్, మైనారిటీ, బీసీ, ట్రైబల్, ఎస్సీ సంక్షేమం, పశుసంవర్ధక, మత్స్య శాఖ తదితర విభాగాలకు సేవలందించిన ఆయన, 2022 ఆగస్టు 16న తెలంగాణ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా ప్రమాణ స్వీకారం చేసి తన న్యాయప్రస్థానాన్ని శిఖరాగ్రానికి చేర్చుకున్నారు. వ్యక్తిగత జీవితంలో బి. రాధా పరమేశ్వరిని వివాహం చేసుకుని మనస్వి, వర్షిత్ అనే సంతానాన్ని కలిగి ఉన్న ఆయన ఎదుగుదల భద్రాచలం ప్రాంతానికి గర్వకారణంగా నిలుస్తోంది.

పట్టుదలతో ఉన్నత స్థానానికి – జస్టిస్ కాజా శరత్

సాధారణ కుటుంబం నుంచి వచ్చిన జస్టిస్ కాజా శరత్ విద్యను ఆయుధంగా మార్చుకుని న్యాయరంగంలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ట్రయల్ కోర్టుల నుంచి హైకోర్టు వరకు విస్తరించిన ఆయన అనుభవం, నిబద్ధతకు నిదర్శనం. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం పట్టణానికి చెందిన జస్టిస్ కాజా శరత్ న్యాయరంగంలో విశిష్ట సేవలందిస్తూ తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. 1971 జనవరి 29న దివంగత నీతారామయ్య, లలితాంబ దంపతులకు జన్మించిన ఆయన పాఠశాల విద్యను ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో, ఇంటర్మీడియట్‌ను ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పూర్తి చేసి, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.ఎస్.సి. (ఎం.పి.సి.) అభ్యసించారు. అనంతరం ఉస్మానియా విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాల నుండి ఎం.ఏ. పూర్తి చేసి, విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయం లా కళాశాల నుండి బి.ఎల్. పట్టా పొందారు. అలాగే ఉస్మానియా విశ్వవిద్యాలయం పీజీ లా కాలేజీలో రాజ్యాంగ చట్టంలో ఎల్.ఎల్.ఎం పూర్తి చేసి న్యాయవిద్యలో పటిమ సాధించారు. 1997 డిసెంబర్ 31న న్యాయవాదిగా నమోదు అయిన ఆయన కొత్తగూడెం, భద్రాచలం ట్రయల్ కోర్టుల్లో ప్రాక్టీస్ ప్రారంభించి, 2002లో హైదరాబాద్ హైకోర్టుకు మారి న్యాయవాది పి.వి. రమణ చాంబర్స్‌లో పనిచేశారు. అనంతరం సంయుక్త ఆంధ్రప్రదేశ్ హైకోర్టు, పరిపాలనా ట్రిబ్యునల్‌లో స్వతంత్ర న్యాయవాదిగా విస్తృత అనుభవం సంపాదించారు. హైకోర్టు విభజన అనంతరం తెలంగాణ హైకోర్టులో రిట్ పిటిషన్లు, సివిల్ రివిజన్లు, అప్పీలు, మోటార్ ప్రమాదాల కేసులు, మధ్యవర్తిత్వం, బెయిల్ పిటిషన్లు, క్రిమినల్ రివిజన్లు వంటి పలు విభాగాల్లో నైపుణ్యాన్ని చాటుతూ విజయవంతంగా ప్రాక్టీస్ కొనసాగించిన ఆయన, తన విశిష్ట సేవలకు గుర్తింపుగా 2022 ఆగస్టు 16న తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు స్వీకరించారు. వ్యక్తిగత జీవితంలో మాధవి ని వివాహం చేసుకుని శ్రీశాంత్ అనే కుమారుని సంతానంగా కలిగి ఉన్నారు.

కష్టజీవి నుంచి జిల్లా జడ్జి వరకు డా. మండా వెంకటేశ్వరరావు

ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవితం ప్రారంభించి, కష్టపడి చదివి న్యాయమూర్తిగా ఎదిగిన డా. మండా వెంకటేశ్వరరావు ప్రయాణం ప్రేరణాత్మకం. ప్రస్తుతం జిల్లా జడ్జిగా సేవలందిస్తూ తన ప్రతిభను చాటుతున్నారు. ప్రస్తుతం కూకట్‌పల్లి జిల్లా జడ్జిగా సేవలందిస్తున్న డా. మండా వెంకటేశ్వరరావు తన ప్రతిభ, కృషితో న్యాయరంగంలో విశిష్ట స్థానం సంపాదించారు. సాధారణ కుటుంబంలో సత్యనారాయణ, నాగమణి దంపతులకు జన్మించిన ఆయన ప్రారంభంలో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూనే విద్యను కొనసాగిస్తూ పట్టుదలతో ముందుకు సాగారు. గుట్టమీద పాఠశాలలో ప్రాథమిక విద్యను అభ్యసించి, ప్రభుత్వ హైస్కూల్‌లో ఉన్నత పాఠశాల విద్యను పూర్తి చేసిన ఆయన, భద్రాచలం ఎల్ఎఫ్ హైస్కూల్‌లో 10వ తరగతి, బూర్గంపాడు జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, భద్రాచలం డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేశారు. అనంతరం ఖమ్మంలోని మానేరు లా కాలేజీలో న్యాయ విద్యను అభ్యసించి, నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్ఎమ్ పూర్తి చేశారు. ప్రస్తుతం విశాఖపట్నంలోని డామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీలో పీహెచ్‌డీ పరిశోధకుడిగా కొనసాగుతున్నారు. కాకతీయ విశ్వవిద్యాలయంలో టాపర్‌గా నిలిచి 2001లో గవర్నర్ డాక్టర్ రంగరాజన్ చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడం ఆయన ప్రతిభకు నిదర్శనం. 2008 నవంబర్ లో న్యాయమూర్తిగా నియమితులై తిరువూరు (కృష్ణాజిల్లా)లో సేవలు ప్రారంభించిన ఆయన, భీమవరం, కాకినాడ, జంగారెడ్డి గూడెం ప్రాంతాల్లో విధులు నిర్వహించి, రాష్ట్ర విభజన అనంతరం నల్గొండ, వరంగల్ ప్రాంతాల్లో పనిచేస్తూ ప్రిన్సిపల్ సబ్ జడ్జిగా బాధ్యతలు నిర్వర్తించారు. అనంతరం జిల్లా జడ్జిగా పదోన్నతి పొంది హైదరాబాద్ సిటీ సివిల్ కోర్టులో 26వ చీఫ్ జడ్జిగా, ఎండోమెంట్స్ ట్రిబ్యునల్ చైర్మన్‌గా సేవలందించి ప్రస్తుతం కూకట్‌పల్లి జిల్లా జడ్జిగా కొనసాగుతున్నారు. వ్యక్తిగత జీవితంలో సతీమణి శిరీషను అడ్వకేట్‌గా సేవలందిస్తుండగా, కుమార్తెలు సాహితి శ్రీ, స్నేహిత తమ తమ విద్యాభ్యాసంలో రాణిస్తున్నారు.

పరిశోధనతో జాతీయ గుర్తింపు – దేవరపల్లి నాగేశ్వరరావు

న్యాయ పరిశోధనలో విశిష్ట కృషి చేసిన దేవరపల్లి నాగేశ్వరరావు జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. ఆయన పరిశోధనలను ఉన్నత న్యాయస్థానాలు ప్రస్తావించడం ఆయన మేధస్సుకు నిదర్శనం.

భద్రాచలం ప్రాంతానికి చెందిన సీనియర్ సివిల్ జడ్జి దేవరపల్లి నాగేశ్వరరావుకు జాతీయ స్థాయిలో విశిష్ట గుర్తింపు లభించింది. ప్రస్తుతం జగిత్యాల జిల్లా మెట్పల్లి సీనియర్ సివిల్ జడ్జిగా సేవలందిస్తున్న ఆయనకు హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌ఫోలియో జడ్జి రేణుక యేరా చేతుల మీదుగా ఘన సన్మానం జరిగింది. దేవరపల్లి సత్యనారాయణ, కళావతి దంపతుల కుమారుడైన నాగేశ్వరరావు సాధారణ కుటుంబంలో జన్మించి కృషితో ఉన్నత స్థాయికి ఎదిగారు.

పదవ తరగతి వరకు స్థానిక కొర్రాజుల గుట్ట స్కూల్ లో, భద్రాచలం ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఇంటర్మీడియట్, భద్రాచలం ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో డిగ్రీ పూర్తి చేసి, ఖమ్మంలోని మానేర్ లా కాలేజీలో న్యాయ విద్యను అభ్యసించారు. 2003 నుంచి అడ్వకేట్‌గా పని చేస్తూ పలు ప్రభుత్వ విభాగాలకు న్యాయసేవలు అందించిన ఆయన, మంథని, భువనగిరి వంటి ప్రాంతాల్లో విధులు నిర్వహించి ప్రస్తుతం మెట్ పల్లి లో సీనియర్ సివిల్ జడ్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. న్యాయ పరిశోధన రంగంలో ఆయన చేసిన కృషి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకుంటూ, రూపొందించిన విధానపరమైన విశ్లేషణలను సుప్రీంకోర్టు, అలహాబాద్ హైకోర్టు వంటి ఉన్నత న్యాయ స్థానాలు ప్రామాణికంగా ఉదహరించడం విశేషం.

పోలీసు దర్యాప్తు విధానాలు, న్యాయ ప్రక్రియలో పాటించాల్సిన రక్షణా ప్రమాణాలపై ఆయన చేసిన లోతైన అధ్యయనం న్యాయవ్యవస్థకు మార్గదర్శకంగా నిలుస్తోందని న్యాయవర్గాలు అభిప్రాయపడుతున్నాయి. ఈ సందర్భంగా న్యాయమూర్తి రేణుక యేరా ఆయన మేధస్సు, కృషి, నిబద్ధతను ప్రశంసించగా, ఆయన విజయాలు యువ న్యాయవాదులకు ప్రేరణగా నిలుస్తున్నాయి అంకిత భావంతో చేసిన పరిశోధన, క్రమశిక్షణతో చేసిన సేవలు ఉన్నత గుర్తింపును తెచ్చిపెడతాయని నాగేశ్వరరావు సాధించిన ఈ ఘనత మరోసారి రుజువు చేసింది. సతీమణి సరోజ, కుమారుడు లలిత్ సాయి, కుమార్తె వర్షిణి లు కూడా తన తండ్రి బాటలోనే ప్రయాణం చేస్తున్నారు

యువతకు స్ఫూర్తి... భద్రాద్రికి గర్వకారణం

ఈ విజయగాథలు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తున్నాయి "పరిస్థితులు కాదు... పట్టుదలే భవిష్యత్తును నిర్మిస్తుంది." మారుమూల ప్రాంతాల యువతకు ఇవి ఆశాకిరణాలుగా నిలుస్తున్నాయి.

భద్రాద్రి నేల నుంచి న్యాయపీఠాలను అలంకరించిన ఈ ప్రతిభలు ప్రాంతీయ గర్వానికి ప్రతీకలుగా నిలుస్తూ, మరెందరో యువతను ఉన్నత లక్ష్యాల వైపు నడిపిస్తున్నాయి. వారి అడుగుజాడల్లో సాగితే అసాధ్యం అన్నది ఏదీ లేదనే నమ్మకాన్ని ఈ విజయాలు బలంగా నాటుతున్నాయి.

జిల్లా కాంగ్రెస్ సెక్రటరీగా అంతోటి పాల్ నియామకం

- ఎమ్మెల్యే రాందాస్ నాయక్ అభినందనలు

కొత్తగూడెం, ఏప్రిల్ 19 (ప్రజాజ్యోతి) జిల్లా కాంగ్రెస్ పార్టీ సెక్రటరీగా నూతనంగా నియమితులైన అంతోటి పాల్‌ను వైరా ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ అభినందించారు. ఎదురుగడ్డలోని తన నివాసంలో శాలువాతో సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి సముచిత స్థానం లభిస్తుందని అంతోటి పాల్ నియామకం దానికి నిదర్శనమన్నారు. పార్టీకి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ బచావ్ సంవిధాన్ సభ్యుడు ఏనుగుల అర్జున రావు, మద్దెల శివకుమార్, గుగులోత్ కృష్ణ, జానీ మియా, సుమంత్, జనార్ధన్, రాజేష్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

కేఓసీలో స్క్రాప్ చోరీ

టేకులపల్లి,ఏప్రిల్ 19,ప్రజాజ్యోతి: ఇల్లందు ఏరియా టేకులపల్లి మండలంలోని కోయగూడెం ఓసిలో ఆదివారం స్క్రాప్ చోరీ చేసి తరలిస్తున్న ఆటోను ఎస్ఎన్ పిసి సిబ్బంది స్వాధీనం చేసుకొని బోడు పోలీసులకు అప్పగించారు. కోయగూడెం ఓసి లో సివిల్ పనులు చేసే గుత్తేదారు వద్ద సబ్ కాంట్రాక్టర్ పొందిన కోండి గణేష్ అనే వ్యక్తి ట్రాలీ లో 30ఎంఎం,10 ఎమ్ రాడ్లను తరలిస్తుండగా కె ఓ సి లో జిమ్మీధర్ గా పనిచేస్తున్న లక్ష్మయ్య ట్రాలీ ఆటోను అపి వివరాలు అడగగా పొంతన లేని సమాధానాలు చెప్పడంతో ఆటో ట్రాలీని స్వాధీన పరుచుకుని బోడు పోలీసులకు అప్పగించారు . బోడు ఎస్ఐ పి. శ్రీనివాస్ రెడ్డి కేసు నమోదు చేశారు. కే ఓసీలో తరచూ స్క్రాప్ చోరి గురవుతున్న కేవైసీ యాజమాన్యం చూసి చూడనట్లు వ్యవస్థ తీరు అనుమానాలకు తావిస్తుంది.

అభివృద్ధిలో లింగాపురం పంచాయితి

చర్ల, ఏప్రిల్ 19:(ప్రజా జ్యోతి): చర్ల మండలంలో శనివారం లింగాపురం పంచాయితీలో అభివృద్ధి పనులపై ఎంపీడీఓ ఈదయ్య లింగాపురం పాడు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా గ్రామ పంచాయతీలో ప్రస్తుతం కొనసాగుతున్న వివిధ అభివృద్ధి పనుల వివరాలను ఆయన అధికారులను అడిగి తెలుసుకున్నారు.ముందస్తు జాగ్రత్తలపై పలు సూచనలు చేసారు. రానున్న వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని గ్రామంలో మురుగు నీరు నిలవకుండా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని అన్నారు.త్రాగునీటి సరఫరా కోసం కలుషిత నీరు చేరకుండా వాటర్ ట్యాంకులను క్లోరినేషన్ చేయాలని, ప్రజలకు తాగునీటి ఎద్దడి కలగకుండా చూడాలని పేర్కొన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేయాలని సర్పంచ్ కార్యదర్శికి సూచనలు చేశారు.ఈ కార్యక్రమంలో లింగాపురం సర్పంచ్ గుగులోత్ మంగ ,గ్రామ పంచాయతీ కార్యదర్శి, వార్డు మెంబర్లు ఇతర పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

యువత భవిష్యత్తుకు ధనియాలపాడు పంచాయతీ కఠిన నిర్ణయం

- నాటు సారాయి తయారీ, విక్రయాలపై ఉక్కుపాదం
- పట్టుబడితే కేసులతో పాటు ప్రభుత్వ పథకాల రద్దు హెచ్చరిక

ఇల్లెందు, ఏప్రిల్ 19,ప్రజాజ్యోతి: యువత భవిష్యత్తును కాపాడేందుకు ఇల్లందు మండలం ధనియాలపాడు గ్రామ పంచాయతీ సంచలన నిర్ణయం తీసుకుంది. గ్రామంలో నాటు సారాయి తయారీ, విక్రయాలను పూర్తిగా అరికట్టేందుకు కఠిన చర్యలు అమలు చేయాలని నిర్ణయించింది. గ్రామ సర్పంచ్ సనప సావిత్రి వెంకన్న అధ్యక్షతన ఆదివారం నిర్వహించిన పంచాయతీ సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానం ఆమోదించారు. గ్రామంలో ఎవరైనా నాటు సారాయి తయారీ లేదా విక్రయాల్లో పాల్గొంటూ పట్టుబడితే వారిపై కఠిన చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా పోలీసు కేసులు నమోదు చేయడం అవసరమైతే పీడీ యాక్ట్ కింద కేసులు పెట్టడం జరుగుతుందని హెచ్చరించారు. అదే విధంగా నిబంధనలు ఉల్లంఘించిన వారికి ప్రభుత్వం అందిస్తున్న రేషన్, పెన్షన్ వంటి సంక్షేమ పథకాలను కూడా రద్దు చేసేలా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గ్రామంలో మద్యం ప్రభావం వల్ల యువత దారి తప్పుతున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకోని ఈ నిర్ణయం తీసుకున్నట్లు సర్పంచ్ తెలిపారు. గ్రామ ప్రజలు కూడా ఈ నిర్ణయానికి మద్దతు తెలుపుతూ సారాయి తయారీని పూర్తిగా నిర్మూలించేందుకు సహకరించాలని కోరారు. సారాయి తయారీ లేదా విక్రయాలపై సమాచారం అందించే వ్యక్తుల వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని పంచాయతీ అధికారులు హామీ ఇచ్చారు.ఈ నిర్ణయం గ్రామంలో చర్చనీయాంశంగా మారగా యువత భవిష్యత్తు కోసం తీసుకున్న ఈ కఠిన చర్యలకు పలువురు అభినందనలు వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మం మినీ ప్లీనరీకి మండలం నుంచి భారీగా తరలిన బీఆర్ఎస్ నాయకులు

- హరీష్‌రావును కలిసిన మండల నేతలు

అన్నపురెడ్డిపల్లి, ఏప్రిల్ 19, ప్రజా జ్యోతి:అన్నపురెడ్డిపల్లి మండలం నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఖమ్మంలో నిర్వహించిన పార్టీ మినీ ప్లీనరీ సమావేశానికి భారీ ఎత్తున తరలివెళ్లారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి,సిద్దిపేట శాసనసభ్యుడు తన్నీరు హరీష్‌రావును కలిసి శుభాకాంక్షలు తెలిపారు.సమావేశంలో అన్నపురెడ్డిపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు బోయినపల్లి సుధాకర్‌రావు, మామిళ్లపల్లి లక్ష్మణరావు, బొల్లంపల్లి ప్రవీణ్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు చల్లా రాంబాబు, మొడియం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. సమావేశం విజయవంతం కావడంతో నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు.

సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్న జిల్లా కాంగ్రెస్ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న

కొత్తగూడెం, ఏప్రిల్ 19 (ప్రజాజ్యోతి) భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్న ఆదివారం మేడారంలోని సమ్మక్క–సారలమ్మ అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రజల శ్రేయస్సు కోరుకున్నారు. సమ్మక్క–సారలమ్మలను దర్శించుకున్న వారిలో సుజాతనగర్ మండల కాంగ్రెస్ అధ్యక్షుడు చింతలపూడి రాజశేఖర్, జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బట్టు మురళి నాయక్, చిమట నాగేశ్వరరావు, బట్టు పవన్, భూక్య గిరి ప్రసాద్, బట్టు వెంకట్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావును కలిసిన సిపిఐ నేతలు

కొత్తగూడెం, ఏప్రిల్ 19 (ప్రజాజ్యోతి) హైదరాబాద్‌లో శస్త్రచికిత్స విజయవంతంగా పూర్తయిన అనంతరం శేషగిరి భవన్‌లో సిపిఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావుకు పార్టీ నాయకులు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే షాబీర్ పాషా, మేయర్ మూడు గణేష్, సిపిఐ 3 టౌన్ ఏరియా కార్యదర్శి యూసుఫ్ బాయ్, సహాయ కార్యదర్శి పోలోజు సత్యనారాయణచారి, జిల్లా నాయకులు బుక్య శ్రీనివాస్, 52వ డివిజన్ కార్యదర్శి ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా అధికార ప్రతినిధిగా వై. శ్రీనివాస్ రెడ్డి ఎన్నిక

కొత్తగూడెం, ఏప్రిల్ 19 (ప్రజా జ్యోతి)కాంగ్రెస్ పార్టీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధికార ప్రతినిధిగా వై.శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మంత్రులు, రాష్ట్ర మరియు జిల్లా కాంగ్రెస్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని స్పష్టం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు తన వంతు పాత్ర పోషిస్తానని తెలిపారు. పార్టీ అభివృద్ధి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని చెప్పారు. తనను ఈ బాధ్యతలకు ఎంపిక చేసిన రాష్ట్ర పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్క, తుమ్మల నాగేశ్వరరావు, ఎంపీ రామ సహాయం రఘురాం రెడ్డి, జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు తోటా దేవి ప్రసన్నతో పాటు రాష్ట్ర, జిల్లా స్థాయి నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. జిల్లాలో పార్టీని మరింత బలోపేతం చేసి, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేసే దిశగా కృషి చేస్తానని వై. శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.